క్లుప్తంగా

అక్షింతల పంపిణీ



దేవక్కపల్లెలో అక్షింతలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

బెజ్జంకి(సిద్దిపేట): అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ అక్షింతలను మండలంలోని దేవక్కపల్లెలో మంగళవారం ఇంటింటికి అందజేశారు. అక్షింతలు పంపిణీ చేసే వారికి డప్పు చప్పుళ్లతో భక్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. సోమవారం ఫైనల్ పోటీలు జరిగాయి. గెలుపొందిన విజేతలకు గాంధీనగర్‌లో సర్పంచ్ దుండ్ర భారతి, తోటపల్లిలో సర్పంచ్ లత రూ.20 వేల నగదు బహుమతి, కప్పు అందజేశారు.

స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శికి సత్కారం

గజ్వేల్: స్వేరోస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మర్కూక్ మండలం చేబర్తి గ్రామానికి చెందిన చిన్ని కృష్ణను గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలు గుర్తింపునిస్తాయి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సమాజ సేవలు గుర్తింపునిస్తాయని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని తిగుల్ గ్రామంలో కేబీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఫిల్టర్ వాటర్‌ను సోమవారం ప్రారంభించారు. అలాగే స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు మండలాల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన జట్లకు ఎస్‌ఐ చంద్రమోహన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని ధర్మారం శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన పత్తి దుర్గయ్య, ఎల్లవ్వ దంపతులు దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వచ్చారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో ధర్మారం శివారులో వాహనం అదుపు తప్పడంతో రోడ్డు పక్కన నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువలో పడిపోయారు. తీవ్రంగా గాయపడిన దంపతులను సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాషాయ జెండాల పంపిణీ

కొండపాక(గజ్వేల్): ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో బజరంగ్ దళ్, ఆర్‌ఎస్‌ఎస్, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికి కాషాయ జెండాలను పంపిణీ చేశారు. దాతల సహకారంతో రెండు వేల జెండాలను పంపిణీ చేశారు. ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేసి హిందుత్వాన్ని చాటాలన్నారు. రెండు రోజుల్లో ప్రతీ ఇంటికి కాషాయ జెండాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో రామ భక్తులు, హిందూ వాహిని బంధువులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన కొండపాకలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి 7 గంటలకు వేడి నీళ్ల కోసం హీటర్‌ను ఆన్ చేసింది. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మంగళవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురీరెడ్డి, ఎంపీటీసీలు మంచాల అనసూయ, ఆరుట్ల లక్ష్మి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబురాలు

ఇంటి లోగిళ్లు ముగ్గులతో కొలువుదీరాయి. ఆవరణలు ముగ్గుల తివాచీలను తలపించాయి. సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా తెల్లవారుజామునే ప్రతీ గ్రామంలోని ఇంటి ఆవరణలు రంగురంగుల ముగ్గులతో సృజన చాటాయి. ముగ్గులేయడంలో మహిళలు పోటీపడ్డారు. మరోవైపు పండుగను పురస్కరించుకుని ఉదయమే సంక్రాంతి పురుషుని సన్నిధిలో గొబ్బెమ్మలు వేసి, నవధాన్యాలు పోసి పిడకలతో పాలను పొంగించారు. సౌభాగ్యం, సిరిసంపదలు కాంక్షిస్తూ ముత్తయిదువలు నోము ఆచరించారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. మరోవైపు పిల్లలు, పెద్దలు తేడాలేకుండా రోజంతా గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందదోలికల్లో మునిగితేలారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



గజ్వేల్‌లో ముగ్గు వేస్తున్న యువతులు



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో ఇంటి ముందు పాలు పొంగిస్తున్న దృశ్యం



దుబ్బాకలో గంగిరెద్దును తిలకిస్తున్న చిన్నారులు



సిద్దిపేటలో ముగ్గును పరిశీలిస్తున్న కౌన్సిలర్ శోభారాణి



మిరుదొడ్డిలో ముగ్గు వేస్తున్న యువతి



బెజ్జంకిలో గంగిరెద్దుతో సర్పంచ్ మంజుల, శ్రీనివాస్ దంపతులు



దుబ్బాకలో పట్టుచీర అందిస్తున్న చైర్‌పర్సన్ వనిత, ఎంఈఓ ప్రభుదాసు



హుస్నాబాద్: బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

ఓటమితో నిరాశ చెందొద్దు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమలోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు క్రీడాకారులకు దోహదపడతాయన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులు ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని సూచించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కొల్గూరు, ద్వితీయ స్థానంలో నిలిచిన అహ్మదీపూర్, తృతీయ స్థానంలో నిలిచిన కిష్టాపూర్ గ్రామాల జట్లకు ఆర్గనైజర్లు అనంత రాములు, నాగరాజు ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాల రమేష్‌గౌడ్, అహ్మద్, నిజాముద్దీన్, నరేష్, నరేందర్ రెడ్డి, రఫీ, శ్రీనివాస్‌చారి, మల్లికార్జున్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి

కాంగ్రెస్ నేతల సంతాపం



శేఖరం

దుబ్బాక టౌన్: దుబ్బాక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చందా శేఖరం అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయన కాంగ్రెస్ పార్టీలో అనేక హోదాల్లో పని చేశారు. రాజక్కపేట సర్పంచ్‌గా, దుబ్బాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు అనేక పదవులు చేపట్టారు. శేఖరం మృతికి కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

కొత్తకొండకు తరలిన గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తరాలుమారుతున్నా ఆ గ్రామస్తులు అనాదిగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను పాటిస్తున్నారు. నేడు రవాణా సౌకర్యం ఎంతో అభివృద్ధి చెందినా వారు ఎడ్ల బండిపై జాతరకు తరలివెళ్తున్నారు. అక్కన్నపేట మండలం జనగామ గ్రామస్తులు 60 ఏళ్లుగా పాటిస్తున్న ఈ ఆచారం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏటా సంక్రాంతి పండుగనాడు హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు బండ్లపై తరలి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి చెందిన కాసర్ల కొత్తకొండ, ఆయన కుమారుడు సంక్రాంతికి నెల ముందు నుంచి ఉపవాసం ఉంటారు. వీరభద్ర స్వామికి ప్రతీకగా భావించే కొత్తకొండ, అతడి కుమారుడు వీరభద్రుని దండకాలు చదువుతూ ఖడ్గాలు ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా భక్తులు వీరభద్ర స్వామికి చెల్లించే కానుకలను కొత్తకొండకు అప్పగిస్తారు. వాటిని స్వీకరించి భక్తులను ఆశీర్వదిస్తారు. అనంతరం ఎడ్లబండ్లపై గ్రామస్తులు కొత్తకొండ జాతరకు బయల్దేరి వెళ్తారు. అక్కడ ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకుంటారు.



కొత్తకొండకు భక్తులు సమర్పిస్తున్న కానుకలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో 2003-04 టెన్త్ విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విదార్థులంతా కలుసుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి ఉపాధ్యాయులు ప్రస్తుత మెదక్ ఆర్డీఓ అంబదాసు రాజేశ్వర్, ఎంఈఓ దేశిరెడ్డి, కనకయ్య, శ్రీనాకర్ రెడ్డిని విద్యార్థులు సన్మానించారు.

పొలం దారి విషయంలో తగాదా

దంపతులపై దాడి, కేసు నమోదు

గజ్వేల్‌రూరల్: పొలానికి వెళ్లే దారి విషయంలో దంపతులపై బంధువులు దాడి చేసిన సంఘటన గజ్వేల్ శివారులో మంగళవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బెజుగామ గ్రామానికి చెందిన చెట్కూరి ఐలయ్య, భాగవ్వ దంపతులకు గ్రామ శివారులో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వీరి సమీప బంధువులు లక్ష్మి, నాగయ్య దంపతులకు వ్యవసాయ భూమి దారి విషయంలో రెండ్రోజుల క్రితం గొడవ జరగడంతో పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయమై మంగళవారం ఐలయ్య, భాగవ్వ దంపతులు బైక్‌పై పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో పట్టణ శివారులో జాలిగామ రోడ్డు రైల్వేబ్రిడ్జి సమీపంలో చెట్కూరి నాగయ్య, లక్ష్మిలతో పాటు వుల్ల మల్లయ్య, వుల్ల బాబు అడ్డగించి వారిపై దాడి చేయడంతో స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన ఐలయ్య

గ్రామస్తులకు నీటి తిప్పలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి మిషన్ భగీరథ నీటి సరఫరాలో పదేపదే అంతరాయాలు ఏర్పడుతుండటంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగనాడు నీరు సరఫరా కాలేదు. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బావులను ఆశ్రయించారు. మంగళవారం కూడా నీరు సరఫరాకాకపోవడంతో సర్పంచ్ కనకవ్వ వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. ఈ నీటిని బిందెలతో పట్టుకునేందుకు గ్రామస్తులు పోటీపడ్డారు. నెలలో రెండు మూడు రోజులు ఇలాంటి పరిస్థితి ఎందుకు తలెత్తుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరితే కోమటిబండ వద్ద పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందని అధికారులు చెబుతున్నరారని సర్పంచ్ భర్త ఐలయ్య పేర్కొన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రథమ సభకు జిల్లా ప్రతినిధులు

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభ హైదరాబాద్ లో మంగళవారం జరిగింది. ఈ సభలకు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీశైలం, జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షుడు భాస్కర్, సభ్యులు జనార్ధన్, గణేష్, రాజు, ప్రసాద్, అఖిల్, శ్రవణ్ తదితరులు హాజరయ్యారు.

సంకల్ప బలంతో ఏదైనా సాధించొచ్చు

చిన్మయ మిషన్ స్వామి యజ్ఞానంద

మర్కూక్(గజ్వేల్): సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించొచ్చని చిన్మయ మిషన్ స్వామి యజ్ఞానంద అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ ఆధ్వర్యంలో 'ఓ యువత మేలుకో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత సంకల్ప బలంతో జీవితంలో ఏ స్థాయికైనా చేరుకోవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ తమ మార్గం తామే నిర్మించుకోవాలని, కేవలం తమ కోసమే తాము కాకుండా సమాజం కోసం కూడా జీవించాలన్నారు. జీవితం సన్మార్గంలో నడవాలంటే గురువుల వద్ద శాస్త్ర అధ్యయనం చేసి జీవితం సుసంపన్నం చేసుకోవాలన్నారు. విద్య అభ్యసించి భావితరాలకు అందించాలన్నారు.

కార్మికులపై కేంద్రం వివక్ష

సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్

దౌల్తాబాద్(దుబ్బాక): బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికులపై వివక్ష చూపుతూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం మండల స్థాయి సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విధానాలతో కార్మికుల జీవన ప్రమాణాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మిరుదొడ్డి యూనియన్ బ్యాంకు మేనేజర్ జెమ్మూ నాయక్ అన్నారు. మండల పరిధిలోని లింగుపల్లిలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత సంకల్ప యాత్రలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు.

అయ్యప్ప స్వామి తిరువాభరణ శోభాయాత్ర

హుస్నాబాద్: మకర సంక్రాంతి పర్వదినాన అయ్యప్ప స్వామి మకర జ్యోతి దర్శనం సందర్భంగా హుస్నాబాద్‌లో కొలువైన అయ్యప్ప స్వామి తిరువాభరణాల శోభాయాత్రను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ భవానీ సహిత కాశీ మరకత లింగేశ్వర దేవాలయంలో స్వామివారి తిరువాభరణాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిది కొత్త నాటకం

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని పెద్దచెరువు సుందరీకరణ పేరుతో నిధులను, మత్తడి స్థలాన్ని కాజేసేందుకు మాజీ ఎమ్మెల్యే జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నాడని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. మంగళవారం సీపీఎం కార్యకర్తలు, నాయకులతో కలసి పెద్దచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల పెద్దచెరువు సుందరీకరణకు రూ.2.95 కోట్ల అంచనా వ్యయంతో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బావమరిది సంపత్‌రెడ్డి పేరిట కాంట్రాక్ట్ అగ్రిమెంట్ ఉందని, దానిని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కుమ్మక్కై చెరువు మత్తడి స్థలాన్ని కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అలాగే కొమురవెల్లి మల్లన్న చెరువు కట్ట సుందరీకరణకు రూ.2.96 కోట్ల అంచనా వ్యయంతో కొమ్మూరి కుమారుడు రాకేష్ రెడ్డిపై కాంట్రాక్టు అగ్రిమెంట్ అయ్యిందని మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరూ చేర్యాల ప్రాంతాన్ని దోచుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. శుక్రవారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేర్యాల పెద్ద చెరువును పరిశీలిస్తే చేర్యాల తహసీల్దార్ ఎలా వెళ్లారని ప్రశ్నించారు. తహసీల్దార్ వెంటనే తన ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలు చేసుకోవాలన్నారు. చేర్యాల తహసీల్దార్ వ్యవహార శైలిపై వెంటనే ఉన్నత అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్, సత్తిరెడ్డి, శ్రీహరి, శోభ, ఇస్తారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పెద్ద చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

లారీ డ్రైవర్, మరో ఇద్దరికి స్వల్పగాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తోటపల్లి శివారు రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ డివైడర్ దాటి రావడాన్ని ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు డ్రైవర్ సంపత్ గమనించాడు. దీంతో బస్సును వేగంగా ముందుకు తీసుకెళ్లినా లారీ ఢీకొనడంతో బస్సు వెనుక భాగంగా దెబ్బతింది. బస్సును ఢీకొన్న లారీ రోడ్డు దిగువ పొదల్లో దూసుకెళ్లింది. ఈ ఘటనలో లారీడ్రైవర్ చక్రపాణి, బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని 108 అంబులెన్సులో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన సమయంలో బస్సులో 39 మంది ప్రయాణికులున్నారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ సంపత్‌ను స్థానికులు అభినందించారు.

మరో సైబర్ మోసం

జగదేవ్‌పూర్(గజ్వేల్): సైబర్ మోసానికి ఓ గ్రామస్తుడు మోసపోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామస్తుడి ఫోన్‌కి ఇన్‌స్టా గ్రామ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని అపరిచితుడు టెలిగ్రామ్ యాప్ ద్వారా లింకు పంపించాడు. డిసెంబర్ 23 నుంచి మొత్తం రూ. 2,00,480 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మంగళవారం తనకు పంపిన లింకు ఓపెన్ చేసేందుకు యత్నించగా బ్లాక్ చేసి ఉండటంతో మోసపోయినట్లు గ్రహించి వెంటనే జాతీయ సైబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం పోలీసులను ఆశ్రయించాడు.

కాలువ నిర్మాణానికి మంత్రి హామీ

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: మల్లన్నసాగర్ కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పెండింగ్‌లో ఉన్న మల్లన్నసాగర్ ఉప కాలువల నిర్మాణాలను చేపట్టాలని కోరామన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న కాలువల ప్రణాళికను మంత్రికి వివరించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని దుబ్బాక, చేగుంట మండలాల్లో నిలిచిన ఉపకాలువల నిర్మాణాలు తదితర విషయాలపై మంత్రితో చర్చించినట్లు చెప్పారు. అలాగే వారం క్రితం కలెక్టరేట్‌లో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించిన అంశాలను, పలుచోట్ల భూసేకరణ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

పారిశ్రామిక వేత్తను కలిసిన ఎమ్మెల్యే

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశామిక వేత్త అన్నారెడ్డి సుభాష్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.